# సప్తపది

(నవల)



అనురాధ (సుజల గంటి)

**Sapthapadi** - Novel
by **Anuradha (Sujala Ganti)**

First Edition: October, 2016

© Author

For Copies & Address :
**Sujala Ganti**
303, Alekhya Rain Drops, Plot No. 17-18,
Gautami Enclave, Beside Chirec Public school,
Kondapur, Hyderabad-500084, Telangana.
Ph. No.7702319351/8897599414
sujalaganti@gmail.com

Copies: 500

Book price : Rs. 50/-

Book Publishing Works:
**JV Publications**
jyothivalaboju@gmail.com

DTP & Type Setting:
**Lakshmi Boomaraju &**
**K. Ravi Prabha**, Cell: 96666 08835

*Printed at:*
**Karshak Art Printers,**
Vidyanagar, Hyd.44

*for Copies:*
**Jyothivalaboju**, Phone: 80963 10140

& All Major Book Shops

# సప్తపది

ప్రకృతి తన పని తాను చేసుకుపోతోంది. శ్రావణ మేఘాలు చిత్రకారుడు తన అందమైన కుంచెతో విదిలించిన రంగుల కలయికలా ఉన్నాయి. వర్షించడానికి సిద్ధంగా ఉన్న మేఘాలు నల్లగా గుంపుగా ఎక్కడికో ప్రయాణమవుతున్న బాటసారిలా తమ గమనాన్ని సాగిస్తున్నాయి. చల్లని పిల్ల తెమ్మెరలు మనస్సుకు, శరీరానికి కూడా ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

చక్కటి వాతావరణంలో వేడి తేనీరు సేవిస్తూ పుస్తక పఠనంలో లీనమయిపోయింది మాధురి. మాధురికి సాహిత్యం పట్ల మక్కువ ఎక్కువ.

కాలింగ్ బెల్ మోగడంతో తపస్సుకు భగ్నం కల్గిన మునీశ్వరుడిలా బాధపడింది. తప్పనిసరిగా లేచి తలుపు తీసి గుమ్మంలో ఉన్న మనిషిని చూడగానే విభ్రాంతికి లోన

య్యింది. ఇంత సడెన్‌గా చెప్పా పెట్టకుండా వచ్చిన మేన కోడల్ని, తన చేతిలో ఉన్న సూట్‌కేస్‌ను చూసి ఆశ్చర్యాన్ని దాచుకుని నవ్వుని మొహంలోకి తెచ్చుకొని "రా! లోపలికి రా! ఫోన్ లేకుండా ఒక్కసారిగా ఊడిపడ్డ నిన్ను చూసి ఆశ్చర్యపోయాను" అంటూ లోపలికి దారి తీసింది మాధురి.

పెట్టె తీసుకొని లోపలికి నడిచింది. పెట్టెను కింద పెట్టి సోఫాలో చతికిలపడింది దీప. మాధురి అన్నగారి కూతురు దీప.

వంటింట్లోకి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

"కాఫీయా? టీయా?" అని అడిగింది.

"మంచి స్ట్రాంగ్ కాఫీ ఇయ్యి అత్తా... తల పగిలి పోతోంది" అంది దీప.

"సరే నేను కాఫీ తెచ్చేలోపు టీ.వీ. చూడు" అంటూ రిమోట్ ఇవ్వబోయింది.

"వద్దత్తా! నువ్వు వచ్చేదాకా కళ్ళు మూసుకుని ఈ సోఫాలో పడుకుంటాను. నీతో చాలా మాట్లాడాలి" అంది దీప.

"ఎలా వచ్చావు? ట్రైన్‌లోనా, ఫ్లైట్‌లోనా?" అని అడిగింది మాధురి.

"ట్రైన్‌లోనే వచ్చాను. అందుకే బాగా అలసటగా ఉంది. కాఫీ తాగి స్నానం చేస్తే కానీ బడలిక తీరదు" అంది దీప.

దీపకు పెళ్ళయి ఎనిమిది నెలలు అయింది. భార్యా భర్తలు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఒక విధంగా వాళ్ళ వివాహం ప్రేమ వివాహం కిందే లెక్క. పెద్దలు తప్పనిసరి పరిస్థితుల్లో ఆమోదముద్ర వేసారు. ఈ కాలంలో పిల్లలు చాలా తెలివిగా ప్రవరిస్తున్నారు. ఇదివరలో ప్రేమ వివాహాలు అంటే ఇంట్లో చెప్పకుండా వెళ్ళిపోయి గుళ్ళోనో, లేక రిజిస్ట్రార్ ఆఫీసులోనో చేసుకునేవాళ్ళు. ఆ తరువాత పెద్దల ఆశీర్వాదానికి వచ్చేవారు. ఇలాంటి పెళ్ళిళ్ళలో వేడుకలు, వీడియోలు, ఫొటోలు ఉండవు.

అదే పెద్దల ఆమోద ముద్ర ఉంటే వేడుకలు, వీడియోలు, ముద్దు ముచ్చట్లు అన్నీ యధావిధిగా జరుగు తాయి. అందుకే తల్లిదండ్రుల వీక్‌నెస్ మీద దెబ్బకొట్టి

సాంప్రదాయ పెళ్ళిళ్ళకే సిద్ధపడుతున్నారు. దీప, శేఖర్ పెళ్ళి కూడా అలాగే జరిగింది. ఒక్కతే కూతురు కాబట్టి గ్రాండ్‌గా పెళ్ళి, ముద్దుముచ్చట్లు, లాంఛనాలు, వీడియోలు, రిసెప్షన్‌లు అన్నీ బాగా జరిగాయి. ఇద్దరూ బాంబేలో పని చేస్తున్నారు.

కాఫీ తేవడానికి లోపలికి వెళ్ళి అయిదు నిమిషాల్లో వచ్చింది. కళ్ళు మూసుకున్న మేనకోడల్ని లేపడం ఇష్టం లేకపోయినా "దీపా" అంది.

"నేను నిద్రపోలేదు అత్తా! కళ్ళు మూసుకున్నాను" అంటూ కాఫీ తీసుకుంది. కాఫీ సిప్ చేస్తూ "కాఫీ చాలా బావుంది" అంది.

"ఇప్పుడు చెప్పు! ఈ ఆకస్మిక రాక ఏమిటి? ఏదైనా ప్రాజెక్ట్ మీద వచ్చావా? శేఖర్ ఎలా ఉన్నాడు?" అంటూ ప్రశ్నించింది మాధురి.

కాఫీ పూర్తయ్యేదాకా ఏం మాట్లాడలేదు.

కప్పు టేబుల్ మీద పెడ్తూ "నేనూ శేఖర్ విడిపోదామనుకుంటున్నాము" అంది.

ఒక్కసారి షాక్‌లా అన్పించింది. తన భావాలను బయటికి చూపించకుండా ఊరుకుంది. పూర్తిగా మాట్లాడాక తన అభిప్రాయం చెప్పవచ్చని.

"నాకు శేఖర్‌కు ఎందులోనూ కలవటం లేదు. తన మాటే నెగ్గాలంటాడు. అలా అయితే నేను మాత్రం ఎలా భరిస్తాను. ఇద్దరం ఒకేలా సంపాదిస్తున్నప్పుడు సమాన హక్కులు ఉంటాయి కదా! తన డామినేషన్ ఏమిటి?"

"డామినేషన్ ఎందుకు అనుకుంటున్నావు? బహుశా అతను చెప్పేది కరెక్ట్ ఉండవచ్చని ఆలోచించావా? లేక నీ మాట వినటం లేదన్న ఉక్రోషంలో డామినేట్ చేస్తున్నాడని అనుకుంటున్నావా?"

"లేదత్తా! మేల్ డామినేషన్! తను మగవాడినన్న అహంకారం. మా అత్తగారు మొగపిల్లవాడని నెత్తికెక్కించుకొని ఏ పనీ నేర్పలేదు. వాళ్ళ అమ్మ చెప్పినట్లుగా నేను కూడా చెయ్యాలనుకుంటాడు. అది నా వల్లకాదు!"

"ప్రతీ మగవాడూ తన భార్య తన తల్లి అంత సమర్థురాలు కావాలని... అనుకుంటాడు. ప్రతీ పిల్లవాడికి

తన తల్లి ఐడియల్ ఉమెన్. తల్లిలోని లక్షణాలు భార్యలో వెతకడం, చాలామంది మగవాళ్ళు చేసే పనే. అందుకే మనవాళ్లు భోజ్యేషు మాతా! అన్నారు. భర్తకు భోజనం పెట్టినప్పుడు తల్లిలా పెట్టాలని!" అంది మాధురి.

"బుల్ షిట్! ఇవన్నీ పాత చింతకాయ పచ్చడి లాంటి మాటలు. మాకిద్దరికీ పడదు. పడనప్పుడు విడిపోవటం బెటర్ కదా?"

"విడిపోయి వేరే పెళ్ళి చేసుకుంటావా?"

"ప్రస్తుతానికి ఆ ఉద్దేశ్యం లేదు. కొంతకాలం పోయాక నాకు నచ్చినవాడు దొరికితే చేసుకుంటానేమో?"

"శేఖర్ కూడా నీకు నచ్చినవాడే కదా! నువ్వు కోరుకున్న వాడే కదా! అమ్మా నాన్న కుదిర్చినవాడు కాదు. ఎనిమిది నెలల్లోనే అతను నచ్చలేదంటున్నావు. అసలు సమస్య ఎక్కడ ఉందో ఆలోచించాలి. మీ ఇద్దరూ రెండేళ్ళు కలిసి తిరిగి ఒకళ్ళ అభిప్రాయాలు ఒకళ్ళు అర్థం చేసుకున్నాక కలిసి జీవిద్దాం అనుకున్నారు కదా! అలాంటిది ఎనిమిది నెలల్లోనే విడిపోతామంటే ఎలాగా? ఏం శేఖర్ కొడ్తాడా? తాగుడు,

పేకాట లాంటి వ్యసనాలు ఉన్నాయా? చెప్పమ్మా...!" అంది మాధురి.

"లేదత్తా... ఆఫీసు, ఇల్లు తప్ప వేరే ఎక్కడకు వెళ్ళడు"

"మరి ప్రాబ్లం ఎక్కడ అమ్మా!"

"అస్సలు ఇంటి గురించి బాధ్యత వహించడు. అన్నీ నేనే చెయ్యాలంటాడు. నేనూ ఆఫీసులో వర్క్ చేస్తాను కదా! అన్ని పనులు ఇద్దరం షేర్ చేసుకోవాలి కదా? తనేమో రిలాక్స్‌డ్‌గా కూర్చుని, వంట చెయ్యడం, సరుకులు తేవడం అన్నీ నేనే చెయ్యాలంటాడు. వీకెండ్స్‌లో ఫ్రెండ్స్, పార్టీలు... నేను చాలా అలసిపోతున్నాను"

మాధురికి నవ్వొచ్చింది. "ఇది పెద్ద ప్రాబ్లమ్ కాదు కదా! ఇద్దరూ కూర్చుని ఈ సమస్యకు పరిష్కారం చూసుకోవచ్చు కదా!"

"నువ్వు అలాగే అంటావు అత్తా! ఇదివరలో ఎన్ని ప్రేమ మాటలు చెప్పేవాడు? నేను లేకపోతే బ్రతకలేనని, నన్ను ఆరాధిస్తున్నానని...ఇలాంటివే ఇంకా చాలా! పెళ్ళయ్యాక అవన్నీ ఎటుపోయాయో అర్థం కావు"

పెళ్ళికి ముందు అమ్మాయిల్ని ఆకర్షించడానికి ఏదో మాట్లాడుతూ ఉంటారు. అవన్నీ పెళ్ళయ్యాక కూడా కంటిన్యూ చెయ్యాలంటే కష్టమే. అమ్మా, నాన్న అమర్చి పెడుతున్నప్పుడు ప్రేమలు దోమలు అంటూ తిరగడం వేరు. పెళ్ళయి బాధ్యతలు పైన పడ్డాక ఇవన్నీ సాధ్యం కాదని తన చిన్నారి మేనకోడలికి ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. అయినా ఊరుకోలేక...

"మరీ సినిమాల్లోలాగా నీవు లేక వీణ పలుక లేనన్నది... అని పాడుకోవటం కుదరదు కదమ్మా!" అంది మాధురి.

"నువ్వు అలాగే అంటావు అత్తా! మీ తరంవాళ్ళు మగవాడు ఏం చేసినా భరించడం అలవాటు అయిపోయింది. ఆర్థికపరంగా కూడా మగవాడి మీద ఆధారపడతారు. నువ్వు కాదులే...మీకు స్వతంత్ర భావాలు కూడా తక్కువే. మీలాగా మేం ఉండలేం!"

'అవును నిజమే! ఎప్పుడూ మొగుడు, పిల్లలు, సంసారం ఎలా బాగుపర్చుకోవాలన్న రంధి తప్ప తమకోసం ఆలోచించిన సమయం లేదు. అలా చేసి మేం తప్పు చేసామా!

అలా చెయ్యకపోతే సంసారంలో శాంతిభద్రతలు లోపించి, పిల్లలు ఏమయి ఉండేవారు?' మాధురి ఆలోచనలు ఆగిపోయాయి.

"అమ్మ దగ్గరకు వెళ్లకుండా నా దగ్గరికి వచ్చావు... అమ్మా నాన్నా సరైన పరిష్కారం చూపిస్తారేమో కదా!"

"అమ్మో! నువ్వయినా అర్థం చేసుకుంటావు. మా అమ్మకు నచ్చచెప్పడం నా వల్లకాదు. తప్పు నాలోనే ఉందం టుంది అమ్మ! శేఖర్ పక్షమే మాట్లాడుతుంది. నాన్న అసలు నన్ను సపోర్ట్ చెయ్యరు. ఎందుకంటే ఈ పెళ్లి ఆయనకు ఇష్టం లేదుకదా! నువ్వయితే నన్ను సరిగ్గా అర్థం చేసు కుంటావు. అదీకాక నీ దగ్గర నాకు చనువు ఉంది" అంటూ మాధురి నోటికి తాళం వేసింది.

వదినగారి సంగతి తెలిసినదే. ఆవిడకు నగలు, చీరలు, షాపింగ్‌లు, కిట్టీ పార్టీలు... ఇవే ఆవిడ జీవితం. మొగుడు సంపాదిస్తాడు. తను ఎంజాయ్ చెయ్యాలి. ఆవిడ ఆనందం అంతా అందులోనే వెదుక్కుంటుంది. పిల్లలు ఎలా పెద్దవాళ్ళయ్యారో ఆమెకు తెలియదు.

తొందరపడకుండా ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించాలి. ఈమధ్య పిల్లలు పెళ్ళంటే బొమ్మల పెళ్ళి అనుకుంటున్నారు. హక్కులు కావాలి కానీ బాధ్యతలు అక్కరలేదు. ఎంతసేపు ఏకపక్షంగా తన గురించి ఆలోచించడం తప్ప ఎదుటివాడి గురించి ఆలోచించడం మానేస్తున్నారు.

"సరే! మామయ్య వచ్చే వేళ అయ్యింది. నేను వంట చేస్తాను. నువ్వు టి.వీ. చూడు. లేకపోతే స్నానం చేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి కాసేపు పడుకో. వంట అయ్యాక పిలుస్తాను" అంటూ వంటింట్లోకి దారి తీసింది.

వంట చేస్తుండగా సెల్ మోగింది. శేఖర్ ఫోన్...

"దీప అక్కడకు వచ్చిందాండీ!" అని.

"ఇక్కడికి వచ్చిందని నీకు ఎలా తెలుసు?" అని అడిగింది మాధురి.

"దీపకు మీ దగ్గర ఎంత చనువో నాకు తెలుసు ఆంటీ. మీ దగ్గరకే వచ్చి ఉంటుందని తెలుసు. ఎలా ఉంది? కోపంగా ఉందా?" శేఖర్.

అతని గొంతులోని ఆత్రుత తెలుపుతోంది దీప అంటే అతనికి ఎంత ప్రేమ ఉందో!

"ఆс! కోపంగానే ఉంది. ప్రాబ్లమ్ ఏమిటి?"

"ఏం లేదు ఆంటీ!" అంటూ ఫోన్ కట్ చేశాడు.

తనంతట తనుగా ఆ విషయం చర్చించడం ఇష్టం లేదని స్పష్టమవుతోంది. అయినా దీప ఇక్కడ ఏం చెప్పిందో తెలియదు కదా! అందుకని అతను మాట్లాడకుండా ఫోన్ కట్ చేశాడు.

కాలింగ్ బెల్ మోగడంతో తలుపు తీయడానికి వెళ్ళింది మాధురి. మాధురి భర్త శ్రీధర్ వచ్చాడు.

డ్రాయింగ్ రూమ్‌లో ఉన్న సూట్‌కేస్ చూసి "బంధువులు ఎవరైనా వచ్చారా?" అని అడిగాడు.

"దీప వచ్చింది!" అంది మాధురి. ఇంకా ఏదో అడగ బోయిన అతన్ని కళ్ళతోనే వారించి "కాఫీ కావాలా?" అని అడిగింది.

"ఆс...కమ్మని స్ట్రాంగ్ కాఫీ!" అంటూ బెడ్‌రూమ్‌లోకి

వెళ్ళాడు బట్టలు మార్చుకుందుకు. భార్య వారించిందంటే సీరియస్ మాటరేనన్నమాట. తరువాత తనే చెప్తుంది అనుకున్నాడు.

❖ ❖ ❖

మాధురి బ్యాంక్‌లో పనిచేస్తూ పిల్లల పెళ్ళిళ్లు అయ్యాక వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంది. ఇన్నాళ్ళూ సంసార తాపత్రయంలో తన అభిరుచులు మరుగున పడిపోయాయి. ఇప్పుడు తను తన కోసం తన అభిరుచులకనుగుణంగా జీవించాలని నిర్ణయించుకుంది. ఎక్కువ సమయం సంగీతం వినడం లేకపోతే పక్కనున్న లైబ్రరీలోని మంచి పుస్తకాలు అధ్యయనం చేయడంలో గడుపుతుంది. ఈ దినచర్యలో ఆమె అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతోంది.

భోజనాలయ్యాక రాత్రి భర్తకు దీప సంగతి చెప్పింది. ఆశ్చర్యపోయాడు శ్రీధర్. ఇంత చిన్న కారణానికి ఆ అమ్మాయి విడాకులు కోరుకుంటోందా? అలా అయితే మాధురి కూడా తనకు ఎప్పుడో విడాకులు ఇచ్చి ఉండాల్సింది. ఏనాడూ తను ఇల్లు గురించి పట్టించుకోలేదు. అన్ని బాధ్యతలు ఆమెకే

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Saptapadi**

* * *